నేటి నుంచి సిరికొండకు బస్సు

నమస్తే ఎఫెక్ట్

ఇచ్చోడ(సిరికొండ), మార్చి 20 : సిరికొండ మండలానికి ఆర్టీసీ బస్సు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని 'సిరికొండకు బస్సు నడపండి సార్..' అనే కథనం బుధవారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైంది. దీంతో ఆర్టీసీ అధికారులు స్పందించి నేడు (గురువారం) నుంచి ఆర్టీసీ బస్సు నడుపుతామని డిపో మేనేజర్ కల్పన తెలిపారు. సరైన సిబ్బంది లేకపోవడంతో వారం రోజుల నుంచి బస్సు నడపడం లేదన్నారు. పదో తరగతి విద్యార్థులు, ప్రజల కోసం ఉదయం, సాయంత్రం రెండు ట్రిప్పులు నడుపుతామని ఆమె తెలిపారు.

ఎక్స్(ట్విట్టర్)లో పోస్ట్ చేసిన సామాజిక కార్యకర్త

నమస్తే తెలంగాణలో ఈ నెల 20వ తేదీన వచ్చిన 'సిరికొండకు బస్సు నడపండి సార్..'అనే కథనాన్ని ఎక్స్ ట్విట్టర్‌లో ఆర్టీసీ హెచ్‌క్యూకు ట్యాగ్ చేస్తూ సామాజిక కార్యకర్త రాథోడ్ మానిక పోస్ట్ చేశారు. దీనికి స్పందించి ఆర్టీసీ డీఎం, ఆర్ఎం, ఆదిలాబాద్ ఆర్టీసీ అధికారులకు సిరికొండకు బస్సు నడపాలని ట్విట్టర్‌లో సూచించారు.

ఎక్స్(ట్విట్టర్)లో పోస్ట్ చేసిన 'నమస్తే తెలంగాణ' కథనం

ఓటు హక్కును వినియోగించుకోవాలి

- ట్రయినీ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతో

ఆదిలాబాద్ రూరల్, మార్చి 20 : 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని ట్రయినీ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. బుధవారం పట్టణంలో జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఏస్టీయూ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఓటర్లకు అవగాహన కల్పించారు. ఎన్నికల జాబితాలో ఓటర్ల నమోదు చేయడం, సరిదిద్దడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రయినీ అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా ఓటర్లు నమోదైన యువత పార్లమెంట్ ఎన్నికల్లో తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అలాగే తమ కుటుంబ సభ్యులకు సైతం ఓటు వేసేలా చైతన్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భరద్వాజ, జిల్లా అధికారులు, పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాల అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ట్రయినీ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతో

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

ఇచ్చోడ, మార్చి 20 : వైరస్ వల్ల వచ్చే వ్యాధుల నుంచి తమ పశువులను కాపాడుకునేందుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి గోవింద్ నాయక్ అన్నారు. బుధవారం అడిగామ(బీ) గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది శేఖర్, దేవ్‌రావ్, రైతులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్, మార్చి 20 : గురుజ గ్రామంలో మండల పశు వైద్యాధికారి రాథోడ్ జీవన్ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

ఆదిలాబాద్ రూరల్, మార్చి 20 : ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో ఈ నెల 21వ తేదీన ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కల్పన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజల సలహాలు, సూచనలు, ఫిర్యాదులకు 9959226002 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెద్దమ్మ తల్లి విగ్రహాల ఊరేగింపు

శోభాయాత్రలో మంగళహారతులతో మహిళలు

బోథ్, మార్చి 20 : కౌట(బీ) గ్రామంలో బుధవారం విగ్రహాల ప్రతిష్ఠాపనలో భాగంగా పెద్దమ్మ తల్లి విగ్రహాలను గ్రామస్తులు ఊరేగించారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో పెద్దమ్మ తల్లి ఆలయాన్ని నిర్మించారు. ఇందులో భాగంగా పెద్దమ్మ తల్లి, పోతారాజు జంటనాగులు విగ్రహాలను ట్రాక్టర్‌లో ఉంచి శోభాయాత్ర చేపట్టారు. మహిళలు పెద్ద ఎత్తున మంగళహారతులతో తరలివచ్చారు. గురు, శుక్రవారాల్లో పూజాది కార్యక్రమాల అనంతరం విగ్రహాలను ఆలయంలో ప్రతిష్ఠించనున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శబరిమాతాజీ ఆశ్రమ వార్షికోత్సవం

శోభాయాత్రలో నృత్యాలు చేస్తున్న భక్తులు

బోథ్, మార్చి 20: కౌత (బీ) గ్రామంలోని శబరిమాతాజీ ఆశ్రమ 12వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మొదట ఆశ్రమంలోని అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ట్రాక్టర్‌లో అమ్మవారి చిత్రపటాన్ని, పల్లకీలో పాదుకలను ఉంచి శోభాయాత్ర చేపట్టారు. డప్పుచప్పుళ్ల మధ్య భక్తులు నృత్యాలు చేశారు. శోభాయాత్రలో గ్రామంతో పాటు కన్గుట్ట, తేజాపూర్, బుద్దికొండ, కుచులాపూర్, ధన్నూర్(బీ), బోథ్, బజార్‌హత్నూర్, పిప్పిరి, ఆదిలాబాద్ పరిసర ప్రాంతాల్లోని గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఆశ్రమంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శివానంద భారత స్వామిజీ, దేవన్న మహారాజ్, బాలన్న, పద్మనాభ గురుస్వామి భక్తులను ఉద్దేశించి ప్రవచనాలు బోధించారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

భక్తి మార్గంలో నడవాలి


ఎమ్మెల్యే జాదవ్ అనిల్, జాన్సన్ నాయక్‌ను సన్మానిస్తున్న సభ్యులు

బోథ్, మార్చి 20: ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. బుధవారం కౌత(బీ) గ్రామంలోని శబరిమాతాజీ ఆశ్రమంలో ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు జాన్సన్ నాయక్‌తో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం గ్రామాల్లో ఆలయాల నిర్మాణాలు చేపట్టి ఆధ్యాత్మిక వాతావరణాన్ని కల్పించిందని గుర్తు చేశారు. బోథ్ నియోకవర్గ పరిధిలోని చాలా గ్రామాల్లో శబరిమాతాజీ ఆశ్రమాలు ఏర్పాటు చేసుకొని భక్తులు నిత్యం అమ్మవారిని పూజిస్తున్నారన్నారు. మాతాజీ ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆశ్రమ కమిటీ సభ్యులు వారికి పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు, ఆశ్రమ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఏడీఏ శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

బజార్‌హత్నూర్, మార్చి 20 : మండలంలో అకాల వర్షంతో దెబ్బతిన్న పంటల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ యువజన సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించడానికి వచ్చిన ఆయన బోథ్ వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ వడగండ్ల వానకు మక్క, జొన్న, నువ్వు, తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం గుర్తించి తక్షణమే వారిని ఆదుకోవాలని కోరారు. అంతకుముందు బజార్‌హత్నూర్, జాతర్ల గ్రామాల్లో వడగండ్లకు దెబ్బతిన్న పంట వివరాలను వ్యవసాయాధికారులతో కలిసి ఏడీఏ వివరాలు సేకరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి సంతోష్, రైతులు విఠల్, రాములు, క్యాతం లక్ష్మణ్, విజేందర్, చంద్రశేఖర్, పవన్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ఇచ్చోడ(సిరికొండ), మార్చి 20: తల్లులు తమ పిల్లలకు పౌష్టికాహారం ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద అన్నారు. బుధవారం సోన్‌పల్లి గ్రామంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువలు అధికంగా ఉన్న చిరుధాన్యాలు అందించాలన్నారు. అలాగే సిరికొండ మండలం వాయిపేట్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా నిర్వహించారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విమల వివరించారు. కార్యక్రమంలో సోన్‌పల్లి పంచాయతీ కార్యదర్శి సునీల్, అంగన్‌వాడీ టీచర్ అనూష, ఆశ కార్యకర్తలు గంగుబాయి, అరుణ, యమున, రేణుక, కౌసల్య, కళావతి, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.


ఇచ్చోడ: సిరికొండ మండలం వాయిపేట్‌లో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విమల

గేర్జంలో పోషణ్ అభియాన్

ఇచ్చోడ, మార్చి 20: గేర్జం గ్రామంలో పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీవో సౌందర్య, సూపర్‌వైజర్ ఉమారాణి హాజరై మాట్లాడారు. . పోషక విలువలు కలిగిన చిరుధాన్యాలు, పండ్లు, ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కమల, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్త, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

గుడిహత్నూర్, మార్చి 20 : మండలంలోని తోషం, సీతాగోంది, జవహర్‌నగర్, గుడిహత్నూర్ గ్రామాల్లో చిన్నపిల్లలకు ఆహారపు విషయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

నార్నూర్, మార్చి 20 : పౌష్టికాహారం తీసుకోవడంతోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి రాంబాబు అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ రక్తహీనత, వ్యాధుల బారినపడకుండా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పల్లెల్లో లభించే పండ్లు, కూరగాయలు,ఆకుకూరలు తప్పనిసరిగా తినాలన్నారు. కార్యక్రమంలో సీడీపీవో శారద, పంచాయతీ కార్యదర్శి అనురాగ్, హెచ్ఈవో నాందేవ్, అంగన్‌వాడీ టీచర్ సంగీత, గర్భిణులు, యువతులు పాల్గొన్నారు.

తాంసి, మార్చి 20: సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పోషణ్ పక్షోత్సవాలను నిర్వహిస్తోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ అన్నారు. పొన్నారి అంగన్‌వాడీ కేంద్రంలో మిషన్ శక్తి ఆధ్వర్యంలో పోషణ్ పక్షోత్సవాలను నిర్వహించారు. ముగ్గులు వేసి, సంపూర్ణ ఆరోగ్యానికి తీసుకోవాల్సిన పండ్లు, కూరగాయాలు, ఆకుకూరలు రంగవళ్లులపై ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రేఖ, మహిళా సాధికారత సిబ్బంది కృష్ణవేణి, కోటేశ్వర్, నిఖిలేశ్వర్, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, ఎస్జేఎం రవీందర్, ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, అంగన్‌వాడీ టీచర్లు దేవమ్మ, గంగమ్మ, ఆశకార్యకర్తలు వెంకటమ్మ, జ్యోతి, వీవో లీడర్స్, మాజీ సర్పంచ్ అశోక్ పాల్గొన్నారు.

రూ.5210నగదు, మట్కా చిట్టీలు స్వాధీనం

ఎదులాపురం, మార్చి 20 : ఆదిలాబాద్ పట్టణంలోని తాంసి బస్టాండ్ సమీపంలో బుధవారం మట్కా నిర్వహిస్తున్న సాబీర్‌ఖాన్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.5210 నగదు, మట్కా చిట్టీలు స్వాధీనం చేసుకున్నామని సీసీఎస్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. టూ టౌన్‌లో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. దాడిలో సీసీఎస్ సిబ్బంది ఉన్నారు.

మద్యం పట్టివేత

స్వాధీనం చేసుకున్న మద్యం

జైనథ్, మార్చి 20 : జైనథ్ మండలంలోని పలు గ్రామాల్లో సీఐ సాయినాథ్, ఎస్ఐ పురుషోత్తం తమ సిబ్బందితో కలిసి విస్తృతంగా తనిఖీలు చేశారు. గిమ్మ(కే), మేడిగూడ గ్రామాల్లో కొనసాగుతున్న బెల్ట్ షాపులపై బుధవారం దాడులు నిర్వహించారు. రెండు షాపులలో సుమారు రూ.90వేల విలువ చేసే 146 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్‌షాపు నిర్వాహకులపై కేసు నమోదు చేశారు.

బోథ్, మార్చి 20 : కౌట(బీ) గ్రామంలో బెల్ట్ షాపు దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు. రూ.41,680 విలువ గల 38 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

స్త్రీనిధి బకాయిలు చెల్లించకుంటే కఠిన చర్యలు

జైనథ్, మార్చి 20 : మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న స్త్రీనిధి రుణాలు బకాయిలు పడ్డాయని, వాటిని వెంటనే చెల్లించకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవని స్త్రీనిధి రీజినల్ మేనేజర్ పూర్ణ చందర్ రావ్ అన్నారు. బుధవారం కాప్రి, కరంజి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులకు వ్యాపారాలు, సోలార్ ఆటోలు సైతం మంజూరు చేస్తామన్నారు. గ్రామ సంఘం పరిధిలో 50 శాతం రుణాలు చెల్లిస్తే, తిరిగి కొత్తగా రుణాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం భగవాండ్లు, ఎంఎస్ అధ్యక్షురాలు సుజాత, సీసీ గంగారాం, వీవోఏలు రామన్న, అనురాధ, సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ కలప పట్టివేత

కలపను స్వాధీనం చేసుకుంటున్న అటవీ శాఖాధికారులు

ఇచ్చోడ(సిరికొండ), మార్చి 20 : సిరికొండలో ముందస్తు సమాచారం మేరకు బుధవారం ఉప అటవీ క్షేత్రాధికారి గీరయ్య ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలపను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గీరయ్య మాట్లాడుతూ టేకు కలపను నిల్వ చేయడం, అక్రమ కలప వాడడం అటవీ చట్టరీత్యా నేరమన్నారు. కలప అక్రమ రవాణాకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. స్వాధీనం చేసుకున్న కలప విలువ రూ.25 వేలు ఉంటుందని తెలిపారు. బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడిలో సిరికొండ సెక్షన్ సిబ్బంది విఠల్, ఎఫ్‌బీవో సందీప్ పాల్గొన్నారు.

25న హోలీ నిర్వహించాలి

ఆదిలాబాద్ రూరల్, మార్చి 20 : ఆదిలాబాద్ జిల్లాలో హోలీ పండుగను ఈ నెల 25వ తేదీన నిర్వహించాలని శ్రీ రామకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి సూచించారు. బుధవారం సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లోని మఠంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాస్త్రీయంగా ఈ నెల 24న రాత్రి కామదహనం, 25వ తేదీన హోలీ పండుగ జరుపుకోవాలన్నారు. సమితి సభ్యులు ప్రపుల్ వజే, ప్రమోద్ కుమార్ ఖత్రి, మాధవ్, సూర్యకాంత్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

నార్నూర్, మార్చి 20 : జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని ఈజీఎస్ ఏపీవో జాదవ్ సురేశ్ అన్నారు. బుధవారం కొత్తపల్లి(హెచ్) గ్రామంలో ఉపాధి హామీ పనులు, కూలీల హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కూలీకి వంద రోజులు పని కల్పిస్తామని తెలిపారు. పనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు ప్రయోజనం చేకూరే పనులు చేపట్టాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ చౌహాన్ వికాస్, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రపుల్ ఉన్నారు.

భూ సమస్య పరిష్కరించాలి

నార్నూర్, మార్చి 20 : భూ సమస్యను పరిష్కరించాలని ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నైతం బాలు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నార్నూర్‌లోని సర్వే నం.16 ప్రభుత్వ భూమిపై ఓ వ్యక్తి లే అవుట్ తీసి ప్లాట్లు విక్రయిస్తున్నప్పటికీ రెవెన్యూ శాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. లే అవుట్ తీసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసుల నివాసం కోసం ఆ భూమిని కేటాయించాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ విచారణ చేపడుతామని హామీ ఇచ్చారు. ఇక్కడ ప్రధాన కార్యదర్శి రామారావ్, మండలాధ్యక్షుడు పూసం ఇర్రూ, నాయకులు కుమ్రం జైతు, తొడసం సంతోష్, విలాస్ ఉన్నారు.

23న జాబ్ మేళా

ఆదిలాబాద్ రూరల్, మార్చి 20 : ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్‌లో ఈ నెల 23వ తేదీన టీఎస్ కేసీ (తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్) ఆధ్వర్యంలో టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) వారి సౌజన్యంతో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, 24/7 ఏఐ, రిలయన్స్ జియో కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ, డిప్లామా పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు ఇంటర్వ్యూకు వచ్చేటప్పుడు ఒక జత రెజ్యూమ్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, ఒరిజినల్ అండ్ జిరాక్స్ సెట్ ఐడీ ప్రూఫ్ తెచ్చుకోవాలని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభవుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ఇమ్రాన్ అలీ 9703533626, డాక్టర్ ఎం నర్సింగరావ్ 9441012766 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఇంద్రవెల్లి, మార్చి 20: మండల కేంద్రంలోని మిలిందినగర్‌కు చెందిన ఎంపీటీసీ గీత్తె ఆశాబాయి భర్త మనోహర్ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను బుధవారం బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ పరామర్శించారు. ఆయన వెంట ఇంద్రవెల్లి మాజీ సర్పంచ్ కోరెంగా సుంకట్‌రావ్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అబ్దుల్ అమ్జద్, మండల కోఆప్షన్ సభ్యుడు మీర్జా జిలానిబేగ్, మాజీ ఎంపీటీసీ సత్యానంద్, బీఆర్ఎస్ మండల ప్రధానకార్యదర్శి రాందాస్, పట్టణ అధ్యక్షుడు శ్యామ్‌కేంద్రే, నాయకులు, తదితరులు ఉన్నారు.

నష్టపోయిన పంటల పరిశీలన

పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ విస్తరణాధికారి ప్రవీణ్

ఇచ్చోడ(సిరికొండ), మార్చి 20 : సిరికొండలో మండలంలో కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను బుధవారం వ్యవసాయ విస్తరణాధికారి ప్రవీణ్ పరిశీలించారు. సిరికొండ, కొండాపూర్ గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివాన బీభత్సానికి పంటలు నేలకొరిగాయన్నారు. నష్టపోయిన పంటల సర్వే నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. ఆయన వెంట రైతులు ఉన్నారు.

ఉపాధి పనులకు కూలీల శాతం పెంచాలి

బోథ్, మార్చి 20: గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు కూలీల శాతం పెంచాలని ఈజీఎస్ అదనపు పీడీ కుటుంబరావు సూచించారు. బుధవారం బోథ్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనులు దాదాపుగా ముగిసినందున జాబ్‌కార్డున్న వారు పనులకు వచ్చేలా ప్రోత్సహించాలన్నారు. ప్రస్తుతం 2,500 వరకు మాత్రమే కూలీలు పనులకు వస్తున్నారన్నారు. కనీసం 35 శాతం వరకు కూలీలు అంటే 4 నుంచి 5 వేల వరకు నిత్యం కూలీలు పనులకు వచ్చేలా చూడాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో రమేశ్, ఏపీవో జగ్దేరావు, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలి

అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ అధికారులు

ఇచ్చోడ, మార్చి 20 : ద్విచక్రవాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఆర్టీసీ అధికారులు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ప్రయాణికులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకం గురించి వివరించారు. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరారు. ఆర్టీసీ గమ్యం యాప్ గురించి ప్రయాణికులకు వివరించారు. కార్యక్రమంలో విలేజ్ బస్ ఆఫీసర్ సతీశ్ పాల్గొన్నారు.

నియమాలు అతిక్రమిస్తే చర్యలు

ఎదులాపురం, మార్చి 20 : ఎన్నికల ప్రచారానికి సంబంధించి ప్రతి ప్రింటింగ్ ప్రెస్ యజమాని ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. బుధవారం కలెక్టర్‌లో ప్రింటింగ్ ప్రెస్, ఫ్లెక్సీ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ప్రచార సామగ్రి ప్రింటింగ్ చేసేటప్పుడు పాటించాల్సిన నియమాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా నియమాలను అతిక్రమిస్తే ఎన్నికల నియమ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మీడియా సెంటర్‌ను సందర్శించారు. రిజిస్టర్లను పరిశీలించి, సోషల్ మీడియాకు సంబంధించి పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి కార్యక్రమానికి ఎంపీ సోయం గైర్హాజరు

తాంసి(తలమడుగు), మార్చి 20 : తలమడుగు మండలం ఉండం గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కేంద్ర మంత్రి అర్జున్ ముండా కార్యక్రమానికి ఎంపీ సోయం బాపురావ్ గైర్హాజరయ్యారు. పార్టీ అధిష్ఠానం ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని నగేశ్‌కు కేటాయించడంతో అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాలకు ఆయన దూరంగా ఉంటున్నారు. ఇది ఇలా ఉంటే బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ సైతం ఈ కార్యక్రమానికి గైర్హాజరు కావడం విశేషం.

ఉత్తమ మహిళ గా మర్సుకోల సరస్వతి

ఉత్తమ మహిళ పురస్కారం అందుకుంటున్న సరస్వతి

ఉట్నూర్ రూరల్, మార్చి 20: లక్కారం గ్రామానికి చెందిన మర్సుకోల సరస్వతి రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, మిస్ ఆసియా రష్మి ఠాకూర్ చేతుల మీదుగా జాతీయ ఉత్తమ మహిళగా పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన మక్ష గ్లోబల్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో అవార్డును ప్రదానం చేశారు. మర్సుకోల సరస్వతి సామాజిక సేవతో పాటు గాయిని, రచయిత్రిగా రాణిస్తున్నారు. ఆమెను గ్రామస్తులు, గాయకులు, కవులతో పాటు పలువురు అభినందించారు.

ఆర్థికం సాయం

ఆదిలాబాద్ రూరల్, మార్చి 20 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ అధ్యాపకులు మానవత్వం చాటారు. కళాశాల ఆవరణలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్య